కరీంనగర్ సూర్య
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల
ఆదివారం 28 జనవరి 2024 10పేజీలు

## రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

సూర్య వేములవాడ



(వివరాలు 2లో)

### రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో

# ఓటింగ్ శాతాన్ని పెంచడానికి స్వీప్ కార్యక్రమాలు

### - జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



సూర్య కరీంనగర్ ప్రతినిధి

రానున్న పార్లమెంట్ ఎన్నికలలో 18 సంవత్సరాలు నిండిన నూతన ఓటర్లు, అర్హులైన ఓటర్లందరు వారి ఓటుహక్కును వినియోగించుకుని రాష్ట్రంలో ఓటింగ్ శాతాన్ని పెంచడం కొరకు రాష్ట్ర ముఖ్యఎన్నికల అధికారి స్వీప్ యాక్టివిటి క్యాలెండర్-2024 ను రూపొందించారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 26 నుండి 3 నెలల కొరకు జిల్లాలోని నాలుగు నియోజక వర్గాలలో స్వీప్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించుటకు జనవరి 27 నుండి ఎప్రిల్ 15 వరకు బూత్ స్థాయి సమావేశాలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పనిచేస్తున్న వారితో పాటు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియెషన్/గేటెడ్ కమ్యూనిటిలు, యువకులు, మహిళలు, థర్డ్ జండర్ లు, పిడబ్ల్యుడి, సీనియర్ సిటిజన్ లు, మొదలైన వారితో స్వీప్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించుటకు షెడ్యూల్ ను రూపొందించడంతో పాటు, కార్యక్రమాలను విజయంతం చేయడానికి ప్రత్యేక అధికారులను కూడా కేటాయించడం జరిగిందని పేర్కోన్నారు. జనవరి 27 నుండి ఫిబ్రవరి 5 వరకు గ్రామసభలు, వివిధ శాఖల ద్వారా ఓటర్ అవేర్నెస్, ఫిబ్రవరి 1 నుండి మార్చి 15 వరకు అన్ని మున్సిపాలిటీలు, మండల హెడ్ క్వార్టర్లలో ఆర్డబ్ల్యూఏ ప్రెసిడెంట్స్, గేటెడ్ కమ్యూనిటీ ఓటర్ ఎన్రోల్మెంట్, ఫిబ్రవరి 8న మండల కేంద్రాల్లో 2కె రన్, ఫిబ్రవరి 16న మున్సిపాలిటీలలో 2కె రన్, ఫిబ్రవరి 23న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బైక్, సైకిల్ ర్యాలీ, 29న కైట్ ఫెస్టివల్, ఫిబ్రవరి 6 నుండి 29 వరకు స్పెషల్ ఎస్ హెచ్ జి మీటింగ్స్,సమైక్య, (మిగతా 2లో)

### మల్టీ జోన్-I పరిధిలో

# 25 మంది సీఐల బదిలీ

సూర్య-గోదావరిఖని:

మల్టీజోన్-1 లో పనిచేస్తున్న 25 మంది సీఐలను బదిలీ చేస్తూ శనివారం మల్టీజోన్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ తరుణ్ జోషి ఉత్తర్వులు జారీ చేశారు. గోదావరిఖని వన్ టౌన్ అదనపు సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎన్.ప్రసాద్ రావు ను గోదావరిఖని టూ టౌన్ కు, ఇక్కడ సీఐగా ఉన్న సూరం వేణుగోపాల్ ను ఐజి కార్యాలయానికి, గోదావరిఖని టూ టౌన్ అదనపు సిఐ గా ఉన్న ఎస్.డి. అఫ్జలోద్దిన్ ను బెల్లంపల్లి రూరల్ కు, ఇక్కడ పనిచేస్తున్న రాజ్ కుమార్ గౌడ్ ను రామగుండం టాస్క్ ఫోర్స్ కు బదిలీ అయ్యారు. రామగుండం సిసిఎస్ లో ఉన్న ఎన్.దేవయ్యను బెల్లంపల్లి వన్ టౌన్ కు, ఇక్కడ ఉన్న ఆర్.బన్సాలీ ని శ్రీరాంపూర్ కు, శ్రీరాంపూర్ సిఐ గా ఉన్న జి.రమేష్ బాబును రామగుండం సిఎస్బీ-4 సీఐగా బదిలీ కాగా, అటాచ్డ్ గా ఉన్న కె.రామచందర్ రావు ను రామగుండం సిసిఎస్-3 సీఐగా బదిలీ అయ్యారు. అదేవిధంగా టాస్క్ ఫోర్స్ పెద్దపల్లి-2 ఎస్బిఐ గా ఉన్న డి.సుధాకర్ ను చెన్నూరు సిఐ గా, ఇక్కడ సిఐ గా ఉన్న సిహెచ్.విద్యాసాగర్ ను ఐజి కార్యాలయానికి అటాచ్ చేయగా, రామగుండం సిఎస్బీ-4 సిఐ గా ఉన్న డి.రాజనరసయ్య ను చెన్నూరు సిఐ గా, ఇక్కడ ఉన్న ఎస్.వాసుదేవ రావును, పెద్దపెల్లి సిఐ గా ఉన్న బి.అనిల్ ను, మంచిర్యాల రూరల్ సిఐడి సంజీవ్ ను, రామగుండం సీఐ వై.చంద్రశేఖర్ గౌడ్ ను, మందమర్రి సిఐ జి.మహేందర్ రెడ్డిని, పెద్దపల్లి క్రైమ్ (మిగతా 2లో)











## రామాలయంలో శివలింగంపై నాగుపాము హల్ చల్

సూర్య, హుజురాబాద్



హుజురాబాద్ పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో శివలింగంపై నాగుపాము హల్ చల్ చేసింది. శనివారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఓ నాగుపాము ఆలయంలో ఉన్న శివలింగం పై చేరుకొని పడగ విప్పింది. అప్పటి వరకు గుడిలో ఉన్న భక్తులు శివలింగం ను చుట్టుకొని ఉన్న నాగుపామును చూసి భయాందోళనకు గురయ్యారు. తర్వాత తీరుకున్న భక్తులు శివలింగంపై పడగ విప్పి ఉన్న నాగు పాము ను చూసి మొక్కుకొని పూజలు చేశారు. తరువాత నాగుపాము బయటకు వెళ్ళి పోయింది. ఈ దృశ్యాన్ని చూసిన భక్తులు ఓం నమ: శివాయ.... అంటూ శివ మహిమ.... అని ఊపిరి పీల్చుకున్నారు.

### ముఖ్యమంత్రిని కలిసిన

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- రాజన్న ఆలయ అభివృద్ధి పై చర్చ
- సాగునీరు, విద్య పై సీఎం దృష్టికి
- మంత్రులతో ప్రత్యేక సమావేశం

సూర్య వేములవాడ

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ,బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు సీతక్క,ముఖ్యమంత్రి ప్రత్యేక సలహాదారులు వేం నరేందర్ రెడ్డి గార్లతో (మిగతా 2లో)



### స్మార్ట్ సిటి పనుల్లో

## పురోగతి కనబరచాలి

### - స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



సూర్య కరీంనగర్ ప్రతినిధి

నగర అభివృద్ధిలో భాగంగా అసంపూర్తిగా ఉన్న పనులలో పురోగతిని కనబరచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్మార్ట్ సిటీ పనుల ప్రగతిపై మున్సిపల్ అధికారులతో అయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్మార్ట్ సిటి లో భాగంగా ఇదివరకే ప్రారంభించిన పనుల్లో పురోగతిలో ఉన్నవి, టెండర్ దశలో ఉన్నవి, ఇంకా ప్రారంభ దశలో ఉన్న వాటి వివరాల జాబితాను రూపొందించి అందించాలని సూచించారు. పనుల్లో ఆలస్యం (మిగతా 2లో)

# కచ్చితమైన తుది ఓటరు జాబితా సిద్ధం చేయాలి

## - స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

రాబోయే ఎన్నికల కొరకు కచ్చితమైన తుది ఓటరు జాబితాను రూపొందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చొప్పదండి నియోజకవర్గం బిఎల్ఓ లతో తుది ఓటరు జాబితా సిద్ధం చేయడం పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో తప్పులు, పొరపాట్లకు ఆస్కారం లేని తుది ఓటరు జాబితాను సిద్ధం చేయడం కొరకు బిఎల్ఓ లు కృషి చేయాలని తెలిపారు. బిఎల్ఓ లు బదిలీ అయిన ఓటర్లను గుర్తించినట్లయితే స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి దానిని ధ్రువీకరించిన తర్వాత జాబితా నుండి వారి వివరాలు



తొలగించాలని తెలిపారు. ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి ఓటరు బదిలీ అయినట్లయితే వారికి ఫామ్-6 ఇవ్వకూడదని తెలిపారు. ఎస్ఎస్ఆర్, ఏఎస్ టి లో ఎటువంటి పెండింగ్ లేకుండా చూడాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన వారందరు నూతన ఓటర్లుగా నమోదు కాబడేలా చూడాలని తెలిపారు. పోలింగ్ కేంద్రం పరిధి లో 90 సంవత్సరాల వయస్సు ఓటర్లను సమీక్షించుకోవాలని, జాబితా నుండి అర్హుడైన ఒక్క ఓటరు వివరాలు కూడా తప్పిపోకుండా జాగ్రత్తగా చూడాలని తెలిపారు. 2 కి.మి. పైబడి దూరంలో పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లయితే వాటి వివరాలు సమర్పించాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, విద్యుత్ మొదలగు అన్ని సౌకర్యాలు ఉండేలా పరిశీలించాలని, ఇంకా ఏవైన అవసరమని గుర్తించినట్లయితే వెంటనే దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో సవరణలు గుర్తించినట్లయితే వెంటనే వాటిని సరి చేయాలని తెలిపారు. హెూంఓటింగ్ కొరకు వికలాంగుల, వయోవృద్ధుల వివరాలు సేకరించుకొని సిద్ధంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గం బిఎల్ఓ లు పాల్గొన్నారు.

## రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి స్వీప్ కార్యక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

మండల సమైక్య వివో మీటింగ్స్, ఏఎల్ ఎఫ్, టీఎల్ఎఫ్ మీటింగులు మార్చ్ 5న అన్ని మండల కేంద్రాల్లో, మార్చ్ 13న అన్ని మున్సిపాలిటీలలో రంగోలి కాంపిటేషన్, ఫిబ్రవరి 1 నుండి ఏప్రిల్ 15 వరకు అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలలో, మున్సిపాలిటీలలో ఓటు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలు మున్సిపల్ కమిషనర్లు, ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ వో లు, బి ఎల్ ఓ లు, సూపర్వైజర్లు బిల్ కలెక్టర్లు పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి టీచర్లు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు కలెక్టర్ తెలిపారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గ సమస్యలపై శనివారం ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం సాగునీటి పై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండల ప్రజల తాగు, సాగునీటికి ఎంతో ఉపయోగపడే కలికోట సూరమ్మ చెరువు కుడి,ఎడమ కాలువల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరారు. వేములవాడ రూరల్ మర్రిపెల్లి గ్రామంలోని మర్రిపల్లి చెరువు, కోనరావుపేట మండలంలోని లచ్చంపేట చెరువులను రిజర్వాయర్ లుగా మార్చడానికి నిధులు విడుదల చేయాలని కోరారు. భీమారం మండలం గోవిందారం చెరువులోకి పోతారం రిజర్వాయర్ నుండి పైప్ లైన్ ద్వారా నీటిని విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. సిరిసిల్ల జిల్లా పరిధిలో ఎగువ మానేరు 9వ ప్యాకేజ్ పనులు వెంటనే ప్రారంభించాల్సిందిగా కోరారు. అగ్రహారం డిగ్రీ కళాశాలలో బాలికల వసతిగృహం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధి కొరకు, వేములవాడ పట్టణంలో జరిగే అభివృద్ధి పనులకు, వేములవాడ టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ పరిదిలో జరిగే అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరారు.త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన వేములవాడ టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ పై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందన్నారు. సీఎం మంత్రులు సమస్యలపై సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

## రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

**సూర్య వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారుజాము నుండి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులతో పరిసరాలన్నీ సందడిగా మారాయి. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కులు చెల్లించుకున్నారు. పరివార దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కళాభవన్ లో స్వామి వారి నిత్యకళ్యాణం లో భక్తులు పాల్గొన్నారు.

## పాత్రికేయుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే డా.సంజయ్.

**సూర్య,రాయికల్**



రాయికల్ సీనియర్ రిపోర్టర్ గుర్రాల వేణు యొక్క అన్న గుర్రాల ప్రసాద్ ఇటీవల అనారోగ్యం తో మరణించగా,వారి కుటుంబ సభ్యులను జగిత్యాల శాసన సభ్యులు డా సంజయ్ కుమార్ పరామర్శించారు.వీరివెంట మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు,పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,కౌన్సిలర్ లు కాంతారావు,శ్రీదర్ రెడ్డి,సాయి,ప్రెస్ క్లబ్ జేఏసీ అధ్యక్షులు వాసరి రవి,ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్,నాయకులు అచ్యుత రావు, ఎలిగేటి అనిల్,హుస్సేన్,తదితరులు ఉన్నారు.

## భార్యను వేధించిన భర్తకు జైలు శిక్ష.

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

అదనపు కట్నం కోసం భార్యను వేధించడమే కాకుండా అత్తగారు ఉంటున్న గుడిసెను తగలబెట్టిన కేసులో నిందితుడైన చెక్కల శివకృష్ణ 25 కు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, 30 వేల రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు జడ్జి లక్ష్మికుమారి శనివారం తీర్పునిచ్చారు. క్లాసిక్యూషన్ కథనం ప్రకారం ఎల్ఎండి పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాత్మా నగర్ చాపల కాలనీకి చెందిన దివ్య (21) అదే కాలనీకి చెందిన చెక్కల శివకృష్ణ లు ఐదు సంవత్సరాల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. మూడు సంవత్సరాలు భార్యతో కలిసి కాపురం చేసిన శివకృష్ణ తదుపరి ఐదు లక్షల రూపాయల అదనం కట్నం తేవాలని భార్యను వేధించసాగాడు. దీనిపై పంచాయతీ పెట్టగా భార్యను మంచిగా చూసుకుంటానని తెలిపి మరల వేదించసాగాడు. తేదీ 2022 అక్టోబర్ 10న రాత్రి శివకృష్ణ అత్తమామలు ఉండే గుడిసెను తగలబెట్టాడు. ఈ సంఘటనపై భార్య దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్ఎండి పోలీసులు శివకృష్ణ పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరి శ్రీరాములు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్షాదారాలు పరిశీలించిన న్యాయమూర్తి, శివకృష్ణకు జైలు శిక్ష జరిమానా విధించారు.

## వైద్య సిబ్బందికి ఘనంగా సన్మానం

**సూర్య, హుజురాబాద్ రూరల్:**



ఈనెల 31తో గ్రామ పంచాయతీల పాలకవర్గం 5 ఏళ్ళ పాలన ముగుస్తుండటంతో మండలంలోని తుమ్మనపల్లి సర్పంచ్ గుడూరి ప్రతాపరెడ్డి ఆద్వర్యంలో వైద్య సిబ్బంది కి ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాలకవర్గం డాక్టర్ పంజాల స్నిగ్ధ, ఆరోగ్య పర్యవేక్షకుడు ఎస్. రమేష్, ఏఎన్ఎమ్ సి. వజ్ర, మోరే కవిత, ఆశావర్కర్లు బండారి పద్మ, గోడిశాల మంజుల, మిడిదోడ్డి స్వరూప, గ్రామ కార్యదర్శి సింగిరెడ్డి సుష్మ, పంచాయతీ సిబ్బందికి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ యాళ్ళ రాజేశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ బేతి రాజిరెడ్డి, కార్యదర్శి సింగిరెడ్డి సుష్మ, వార్డు సభ్యులు గాజుల కుమారస్వామి, గోడిశాల కనక లక్ష్మీ శ్యామ్, సుమ, బోడ పుష్ప, బోక్కల వసంత, గోడిశాల శ్రావణి, పెండాల మొండయ్య, గొడిశాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ సిటి పనుల్లో పురోగతి కనబరచాలి

(మొదటి పేజీ తరువాయి)

కాకుండా ఉండాలని, గుత్తేదారులు పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పనులను ఆలస్యం చేసినట్లయితే తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే మరోకరితో పనులను పూర్తి చేయించాలని తెలిపారు. చివరి దశకు చేరుకున్న వాటిని త్వరగా పూర్తిచేయాలని, అదేవిధంగా ప్రాధాన్యతను బట్టి పనులను త్వరగా పూర్తి చేసేలా చూడాలని తెలిపారు. ఎస్టిమేషన్, మెజర్ మెంట్ లలో పొరపాట్లు జరగకుండా అధికారులు పరిశీలించి దృవీకరించాలని, ఎదైన పొరపాట్లు జరిగినట్లయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఇతర మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మల్టీ జోన్-1 పరిధిలో 25 మంది సీఐల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

బ్రాంచ్-2 సిఐ గా ఉన్న పి.రాజేంద్రప్రసాద్ ఐజి కార్యాలయానికి అటాచ్ చేశారు. అదేవిధంగా రాజన్న సిరిసిల్ల జిల్లా సిసిఎస్ సీఐగా ఉన్న కె.రవీందర్ ను చెన్నూర్ టౌన్ సిఐ గా, ఆదిలాబాద్ పిసిఆర్ లో ఉన్న బి.రవి ని మందమర్రి సిఐగా, లక్షేట్ పేట సిఐగా ఉన్న ఆర్.కృష్ణను పెద్దపెల్లి సిఐగా, రామగుండం సిసిఆర్బి లో ఉన్న ఆకుల అశోక్ ను మంచిర్యాల రూరల్ సీఐగా బదిలీ అయ్యారు. అలాగే రామగుండం ట్రాఫిక్ సిఐగా పనిచేస్తున్న టి.ప్రవీణ్ కుమార్ ను రామగుండం సీఐగా, మల్టీ జోన్-1 పరిధిలోని నర్ నూర్ సిఐగా పనిచేస్తున్న కే ప్రేమ్ కుమార్ ను మంచిర్యాల సిఎస్బి-2 సిఐ గా, ఇక్కడ పనిచేస్తున్న జి మొగిలిని కరీంనగర్ సిసిఆర్ బి కి బదిలీ చేశారు. ఇదిలా ఉండగా త్వరలో మరికొన్ని బదిలీలు ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## ప్రభుత్వం నిర్లక్ష్యంతో చొప్పదండి నియోజకవర్గం పంట పొలాలు ఎండిపోతున్నాయి

### - మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**సూర్య, చొప్పదండి**

గంగాధర మండలం ర్యాలపల్లి గ్రామ పరిధిలోని కుర్మపల్లిలో నీరు లేక ఎండిపోతున్న పంట పొలాలను మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తమ బ్రతుకులు మారుతాయని నమ్మి ఓట్లు వేసిన రైతులను ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు.చొప్పదండి నియోజకవర్గం లోని పలు గ్రామాల రైతులు నారాయణపూర్ రిజర్వాయర్ నమ్ముకొని పొలాలు సాగు చేస్తుంటారని,కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి నార్లు పోసి, నాట్లు వేసిన రైతులు సాగునీరు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 60 రోజులు గడుస్తున్న ఇప్పటివరకు రైతుబంధు రాలేదు, రైతులకు రుణమాఫీ జరగలేదని ఆరోపించారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి స్పందించి రెండు రోజుల్లో నారాయణపూర్ రిజర్వాయర్కు నీటిని విడుదల చేయకుంటే రైతులకు తో కలిసి ఆందోళన ఉధృతం చేస్తాం అన్నారు.

## గ్రామాభివృద్ధి పేరిట అక్రమ వసూళ్ళు

**సూర్య కోనరావుపేట**

గ్రామాభివృద్ధి పేరిట ఇసుక ట్రాక్టర్ల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడ్డ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామ శివారులోని మూలవాగు నుండి అధికారుల అనుమతులతో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ యజమానుల వద్ద వెంకట్రావుపేట గ్రామానికి చెందిన తాడు మల్లేశం అనే వ్యక్తి గ్రామాభివృద్ధి పేరుతో ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.150 అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు రాగా విచారణ చేసి అక్రమంగా వసూలు చేస్తున్న మల్లేశం పై కేసు నమోదు చేసి రిమాండ్ తరిలించామన్నారు. మండలంలో ఎవరైనా గ్రామాభివృద్ధి పేరుతో గ్రామాల్లో బలవంతపు అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఆంజనేయులు హెచ్చరించారు.

## హాస్పిటల్ లో ఎంపి బండి సంజయ్ పరామర్శ

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



గునుకుల కొండాపూర్ మాజీ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ తండ్రి అయిన సొల్లు రాజావీరు ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోయినాడు. కాలు తుంటి ఎముక విరిగిపోయింది కార్తికేయ హాస్పిటల్ కరీంనగర్ లో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హాస్పిటల్ కి వచ్చి నేను ఉన్నాను అని డాక్టర్లతో మాట్లాడి అన్ని విషయాలు తెలుసుకుని ఆ కుటుంబానికి ధైర్యాన్ని ఇచ్చారు..

## నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభించిన

# ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**సూర్య ఎండపల్లి 01**

మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన నూతన గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని శనివారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. నూతన గ్రామ పంచాయితీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నన్ను భాగస్వాములను చేసినందుకు చాలా సంతోషంగా ఉందని, ప్రభుత్వం వచ్చిన వెంటనే



ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం,ఆరోగ్య శ్రీ పరిధి పెంపు వంటి హామీలను అమలు చేయడం జరిగిందని, రాష్ట్రం ఎంత ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ముందుకు వెళ్ళడం జరుగుతుందని,ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలు అందించే విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని,కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తుందని ఎండపెల్లి మండలానికి సంబందించిన,ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. లక్ష్మణ్ కుమార్ అనే నన్ను ఎమ్మెల్యే గా భావించ వద్దు అని మీ సేవకుడిగా భావించండి అని తెలిపారు,ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము రాంబాబు, ఉప సర్పంచ్ గోనెలక్ష్మిగంగారెడ్డి ,ఎంపిటిసి నక్క పూజిత



ప్రశాంత్ ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, లింగయ్య,తహశీల్దార్ ఉదయ్ కుమార్, ఎంపిడిఓ సంజీవ రావు, ఎంఈ ఓ బత్తుల భూమయ్య, పంచాయతీ కార్యదర్శి సుంకపాక గోమతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి శైలేందర్ రెడ్డి వార్డు సభ్యులు మరియు గూడ రామ్ రెడ్డి, జి రెడ్డి మహేందర్రెడ్డి,రామడుగు రాజేశం, న్యాతరి మల్లేశం,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఇంటర్ మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

**సూర్య జగిత్యాల**

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల మూల్యాంకన కేంద్రంను జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 ఆధ్వర్యంలో ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి బొప్పరాతి నారాయణకు శనివారం వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం కరీంనగర్ లో ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్ సెంటర్ నిర్వహించబడు తున్నదని, జగిత్యాల జిల్లా పరిధిలోని 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు, ప్రైవేట్ జూనియర్



కళాశాలలు, మోడల్ స్కూల్ ల అధ్యాపకులు కరీంనగర్ కు రాకపోకలు సాగించేందుకు కోసం వ్యయ, ప్రయాసలను ఎదుర్కొంటున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల తోపాటు, ఎస్ కే ఎన్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ సెంటర్ ఏర్పాటు చేయడానికి అవసరమైన వసతులు ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. 2023 ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ మరియు వార్షిక పరీక్షలు, సప్లమెంటరీ పరీక్షల్లో విధులు నిర్వహించిన పలువురు అధ్యాపకులకు పెండింగ్లో ఉన్న పారితోషికాలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు కొట్టాల తిరుపతిరెడ్డి, మహిళా కార్యదర్శి ఎం.శ్రీలత, అధ్యాపకులు మాజీద్, సాజిద్, సుమేరా, శిల్ప పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి పలువురు నాయకుల చేరిక



**సూర్య, మెట్ పల్లి టౌన్**

పట్టణంలోని జువ్వాడి భవన్లో శనివారం జువ్వాడి నరసింగ రావు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలోకి మల్లాపూర్ మండల్, కుస్తాపూర్ గ్రామ ఎక్స్ సర్పంచ్ గుండా బుచ్చన్న చేరారు.అనంతరం వారికి పార్టీ కండువా కప్పి నర్సింగరావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ విలువలు, నియమాలు నచ్చి పార్టీలో చేరినట్లు తెలిపారు.

## మృతి చెందిన కుటుంబీకులను పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు

**సూర్య కోరుట్ల రూరల్**

మండలంలోని పైడిమడుగు గ్రామానికి చెందిన తురగ భీమ్ రెడ్డి ఆడేపు లక్ష్మి దేవనపల్లి రాజం దుంపల లక్ష్మణ్ లు ఇటీవల మరణించగా



సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు శనివారం మృతి చెందిన కుటుంబీకుల ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావుతోపాటు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జనార్ధన్ మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆసి రెడ్డి రాజేశం దొమ్మటి నరేందర్ రాజిరెడ్డి రాకేష్ అశోక్ సత్యం రెడ్డి మోహన్ రెడ్డి జగదీశ్వర్ తదితరులు ఉన్నారు.

## గంగిరెద్దుల వారికి తండ్రి జ్ఞాపకార్థం కోడెను అందజేత



**సూర్య గొల్లపల్లి**

గొల్లపల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో, గంగిరెద్దుల వారికి మిల్కూరి చంద్రయ్య, తండ్రి జ్ఞాపకార్థము మిలుకూరి రాజయ్య పేరు మీద, సర్పంచ్ మిలుకూరి అనసూర్య చంద్రయ్య కుటుంబ సమేతంగా, 25 వేల విలువగల కోడెను, కొని వారికి శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అందజేశారు. గతంలో 20 సంవత్సరాల క్రితం,కూడా ఒక కోడెను ఇస్తే అది, మరణించినందున, వారు వచ్చి మళ్ళీ అడగగానే, మరి ఒకటి కొనివ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో, గ్రామంలోని గ్రామస్తులు పెద్దలు వార్డు సభ్యుల సమక్షంలో అందజేశారు.

## రోడ్డు భద్రత పై విద్యార్థులకు అవగాహన

**సూర్య -కోరుట్ల**

కోరుట్ల పట్టణంలోని పి ఆర్ బి ఎం కళాశాలలో శనివారం రోడ్డు భద్రతా వారోత్సవాల ను పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సై కిరణ్ కుమార్



విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోడ్లపై వాహనాలపై ప్రయాణించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు నియమ నిబంధనలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు ఎదుటివారి, తమ యొక్క భద్రతను దృష్టిలో పెట్టుకోవాలని, సిగ్నల్స్ ఉన్న కూడలి వద్ద సిగ్నల్స్ యొక్క నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.




## మృతుల కుటుంబాలను పరామర్శించిన కృష్ణారావు

**సూర్య, మెట్ పల్లి**



పట్టణంలో మరణించిన ఇరువురి కుటుంబాలను శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. మొదటగా పట్టనానికి చెందిన మిరియాల లక్ష్మీ కాంతారావు సతీమణి మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అలాగే పోచంపల్లి ఆశమ్మ మరణించగా వారి గృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆనంతరం మండలంలోని జగ్గాసాగర్ గ్రామానికి చెందిన పుప్పాల గంగాధర్ తండ్రి మరియు అదే గ్రామానికి చెందినా జంగిటి రాజేష్ తండ్రి మరియు వెంకట నర్సయ్యలు ఇటీవల మరణించగా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు మృతి చెందిన కుటుంబీకుల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధలో ఉన్న కుటుంబాలకు మనోధైర్యంతో ఉండాలని కృష్ణారావు వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు వెంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జెట్టి లింగం, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ రాజేష్ తదితరులు ఉన్నారు.

## మరోసారి జిల్లా అధ్యక్షునిగా సత్యనారాయణ



**సూర్య, మెట్ పల్లి టౌన్**

భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షునిగా రెండవసారి పైడిపల్లి సత్యనారాయణ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షులు బొడ్ల రమేష్ శనివారం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనికెల నవీన్, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి కుడుకల రఘు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సుంకేట విజయ్ తదితరులు పాల్గొన్నారు

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళదాం



**సూర్య -కోరుట్ల**

దేశ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం గత పది సంవత్సరాల నుండి అభివృద్ధి చేస్తున్న పథకాలను గావు చలో బస్తీ చేలో అభియాన్ పల్లెకు పోదాం అనే కార్యక్రమంతో గ్రామాలకు వెళ్లి, ప్రతి గల్లీలో ఇంటింటికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి ,రానున్న లోక్సభ ఎన్నికలలో ప్రజల యొక్క మద్దతును కూడగట్టుదామని బిజెపి నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో జరిగినా సమావేశంలో పలువురు వ్యక్తులు మాట్లాడారు. పేదల సంక్షేమం, మహిళా సాధికారత, అంతర్గత బాహ్య భద్రత, సాంస్కృతిక పునరుద్ధరణ, విదేశాలలో భారతదేశ గౌరవాన్ని పెంచడం వంటి అనేక రంగాలలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిద్దామని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రంజిత్, మోహన్ ,జిల్లా అధ్యక్షుడు మోర పెల్లి సత్యనారాయణ, బింగి వెంకటేష్ ,పీసరి నరసయ్య ,రాగిల్లి సత్యం, యాదగిరి బాబు, చంద్రశేఖర్, దశరథ రెడ్డి, కస్తూరి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

# భారతరత్న కర్పూరి ఠాకూర్ మార్గం స్ఫూర్తిదాయకం

## - మండల నాయి బ్రాహ్మణ యువజన సంఘం అధ్యక్షుడు సూత్రం శ్రీధర్ నాయి

**సూర్య, సెంటినరీ కాలనీ**

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సోషలిస్టు నేత, బీహార్ దివంగత మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ కు భారత ప్రభుత్వ అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న' అవార్డు ను ప్రదానం చేయడం పట్ల రామగిరి మండల నాయి బ్రాహ్మణ యువజన సంఘం అధ్యక్షుడు సూత్రం శ్రీధర్ నాయి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రామగిరి మండల నాయి బ్రాహ్మణ యువజన సంఘం అధ్యక్షుడు సూత్రం శ్రీధర్ నాయి మాట్లాడుతూ రాష్ట్రపతి కార్యాలయం మంగళవారం నాడు దివంగత నేత కర్పూరి ఠాకూర్ శతజయంతి కి ఒక రోజు ముందే ఆయనకు భారతరత్న అవార్డును కేంద్రం ప్రకటించడం యావత్తు నాయి బ్రాహ్మణులలో సంతోషాన్ని కలిగించిందన్నారు. బీహార్ రాష్ట్రంలోని సమస్తిపూర్‌లో 1924 జనవరి 24న నాయి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన కర్పూరి ఠాకూర్ విద్యార్థి దశ నుంచే జాతీయోద్యమంలో పాల్గొనీ 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో జైలుకు వెళ్లారన్నారు. అనంతరం రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ తొలిసారి 1952లో సోషలిస్ట్ పార్టీ టిక్కెట్టుపై బీహార్ శాసనసభ సభ్యుడిగా ఎన్నికై, పిదప 1968లో బీహార్ ఉప ముఖ్యమంత్రిగా, డిసెంబర్ 1970 నుండి జూన్ 1971 వరకు, ఆపై జూన్ 1977 నుండి ఏప్రిల్ 1979 వరకు రెండు పర్యాయాలు బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. సామాజిక న్యాయం, పేదలు, దళితుల సంక్షేమానికి ఆయన విశేషంగా పాటుపడ్డారనీ, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెనుకబడిన తరగతులకు సమాన ప్రాతినిధ్యం



కల్పించేందుకు ఉద్దేశించిన 'కర్పూరి ఠాకూర్ ఫార్ములాను సీఎంగా ఉన్నప్పుడు ఆయన తీసుకువచ్చారన్నారు. 1978లో బీహార్‌లో బీసీలకు 26 శాతం రిజర్వేషన్ అమలు చేసి కర్పూరి ఠాకూర్ జననాయక్‌గా పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం అవిరమంగా కృషి చేసిన జననాయక్ కర్పూరి ఠాకూర్‌కు దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ప్రకటించడంపై, కర్పూరి ఠాకూర్ శతజయంతి సందర్భంలో ఆయనకు దేశ అత్యున్నత పురస్కారం రావడం మరింత ఆనందదాయకమని అన్నారు. అట్టడుగు బలహీన వర్గాల అభ్యున్నతి పట్ల ఆయనకున్న చెక్కుచెదరని దీక్ష, సమసమాజ స్థాపనకు చేసిన కృషి స్ఫూర్తిదాయకమని శ్రీధర్ నాయి అన్నారు.

## సర్వేష్‌కు నామినేటెడ్ పదవి ఇవ్వాలని

### - మంత్రి శ్రీధర్ బాబుకు మండల నాయకులు వినతి

**సూర్య ముత్తారం**



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీధర్ బాబు గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన పూదరి సర్వేష్ గౌడ్ కు నామినేటెడ్ పదవి ఇవ్వాలని మంథని నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ 20 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీధర్ బాబు గెలుపు కోసం తన వంతు కృషి చేస్తూ నియోజకవర్గంలో ఉన్న ఎంపిటీసీలను, సర్పంచులను సమన్వయం చేస్తూ కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షించే విధంగా కృషి చేస్తూ శ్రీధర్ బాబు గెలుపు కోసం ఎంతో పాటుపడ్డారు. సర్వేష్ గౌడ్ కు పదవి ఇవ్వాలని మంత్రి శ్రీధర్ బాబును కలిసి వినతి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతంపేట సర్పంచ్ పులిపాక నాగేష్, ఇండ్ల సది, మామిడి వినోద్, పెసర శంకర్, మేడి శంకర్, అల్లాడి యాదగిరి రావు, రామగిరి మహేందర్, గుజ్జ లింగారావు ,వెల్మరెడ్డి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**సూర్య ఓదెల**



ఓదెల మండలం హరిపురం గ్రామానికి చెందిన కొండపలకల రాములు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను స్థానిక శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు శనివారం రోజు పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మృతుని కుటుంబ సభ్యులకు ఐదువేల రూపాయలు 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రేమ్ సాగర్ రెడ్డి, నారాయణరెడ్డి, అమ్ముల బిక్షపతి, మారబోయిన రామస్వామి, గాజుల శివశంకర్, తుమ్మల సదయ్య, కృష్ణ స్వామి, మధు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ వెంచర్ పై కలెక్టర్‌కు ఫిర్యాదు

**సూర్య- పెద్దపల్లి రూరల్**

మండలంలోని రాఘవపూర్ గ్రామంలో అనుమతి లేకుండా వెంచర్ల లో ప్లాట్లు విక్రయిస్తున్నారని గ్రామస్తులు శనివారం కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని సర్వేనెంబర్ 1116 లోని 5 ఎకరాల వ్యవసాయ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి రోడ్డు వేసి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదివరకు అధికారులు హద్దురాలను తొలగించిన వారిలో మార్పు రాకపోగా యతేయచ్చగా ప్లాట్లు విక్రయిస్తున్నట్లు ఆరోపించారు . ఈ అక్రమ వెంచర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తాడిచెట్టి శ్రీకాంత్ , కోడపత్రి వినోద్ లు కోరారు.

## ఘనంగా ముగిసిన పీర్ పహాడి దర్గా ఉత్సవాలు

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం బేగంపేట గుట్టపై గల సయ్యదునా పీర్ పహాడీ బాబా ఉరుసు ఉత్సవాలు శనివారం తో ముగిశాయి. గత మూడు రోజులుగా ఈ వేడుకలు ప్రారంభం కాగా మొదటి రోజు గుసుల్ షరీఫ్, రెండవ రోజు సందల్ షరీఫ్, మూడవరోజు శనివారం ఉర్సు షరీఫ్ ముగిసాయి. ఉరుసు ఉత్సవాలకు గాను కరీంనగర్ వరంగల్ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి భారీ ఎత్తున భక్తులు హాజరై సందల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా గత రెండు రోజుల నుంచి పీర్ పహాడీ దర్గా వద్ద భక్తులతో కిటకిటలాడింది. దర్గా వద్ద భక్తులు ఫాతిహా ఇచ్చి మొక్కులు చెల్లించుకు న్నారు. గత రెండు రోజులుగా ఉత్సవాల సందర్భంగా దుకాణాలు గెలిచాయి. ఈ వేడుకల్లో రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ బేగంపేట సర్పంచ్ బుర్ర పద్మ శంకర్ ఎంపీటీసీ మారగోని కరుణ కుమారస్వామి తో పాటు కమాన్పూర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి రాజకీయ నాయకులు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉరుసు వేడుకలు ప్రశాంతంగా ముగిసాయి.

## మండల మీసేవ సంఘం నూతన కమిటీ నియామకం

**సూర్య-పెద్దపల్లి రూరల్**



పెద్దపల్లి మండల మీసేవ నిర్వాహకుల సంఘం నూతన కమిటీ జిల్లా అధ్యక్షులు నగునూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా మిట్టపల్లి శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శిగా మహేందర్, సహాయ కార్యదర్శిగా బంక భూమేష్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ , కోశాధికారిగా కనపర్తి రామకృష్ణ కార్యవర్గ సభ్యులుగా సొల్లూరి రాజేందర్, కన్నం తిరుపతి, అబ్దుల్ కలీల్, గట్టు నరేందర్, గుడి కందుల సురేష్ ఎన్నుకున్నారు.

## ద్యార్థులకు బహుమతి అందజేత

**సూర్య ముత్తారం**



ముత్తారం మండలంలోని విద్యార్థిని విద్యార్థులకు చెకుముకి మండల స్థాయి పోటీలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్తారం నందు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండల స్థాయి చెకుముకి పోటీలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రక్షిత, ఇంద్రా, అశ్విత విద్యార్థినీలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్తారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మాదేవి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు రావి శ్రీనివాస్, ముత్తారం కెజిబివి అధ్యాపకులు మనోలత, ఓడేడు ఉపాధ్యాయులు రవి, నారాయణ రావు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లను సన్మానించిన ఎంపీపీ

**సూర్య ఓదెల**

ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం రోజు నిర్వహించిన సర్వసభ్య సమావేశం లో ఎంపీపీ కూనారపు రేణుక దేవి మండలంలోని సర్పంచ్ లను శాలువాలతో ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. సర్పంచుల పదవీకాలం ఈ నెలాఖరు వరకు ముగుస్తుండడంతో ఇదే చివరి సర్వసభ్య సమావేశం కావడం తో కార్యక్రమంలో సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

### -రామగిరి ఎస్సై కటికే రవిప్రసాద్



**సూర్య సెంటినరీకాలనీ**

ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని రామగిరి ఎస్సై కటికే రవి ప్రసాద్ అన్నారు. రామగిరి పోలీస్ స్టేషన్ ఆవరణలో రామగిరి మండలం కు చెందిన అన్ని గ్రామాల ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ పై, రోడ్ సేఫ్టీ లపై మరియు రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రామగిరి ఎస్సై కటికే రవి ప్రసాద్ ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, వాహనాలకు సంబంధిత పత్రాలను ఉంచుకోవాలని సూచించాలని తెలిపారు. అంతే కాకుండా ప్రతి ఒక్కరు మద్యం సేవించకుండా వాహనాలు నడపాలని తెలిపారు. ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు చూసినట్లయితే ఎక్కువ మద్యం తాగి వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగినాయని అన్నారు. కావున ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరారు. ఎవరైనా తాగి మద్యం నడిపిన, వాహనాలకు సరైన ధ్రువ పత్రాలు లేకుండా వాహనాలను నడిపిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నో బ్యాగ్ డే

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సెంటినరీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం లో స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు తో విద్యార్థులు సమావేశమయ్యారు. గ్రామ మౌలిక సదుపాయాల గురించి తెలుసుకున్నారు. గ్రామంలోని రామగిరి ఖిల్లా ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో నాటిన మొక్కలను,చెట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఈశ్వరమ్మ, బరపటిపల్లి హెచ్ఎం హరిత, ఉపాధ్యాయురాలు టి. రజిత, లతా తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన జేఈఈ (మెయిన్స్) ప్రవేశ పరీక్ష

**సూర్య, సెంటినరీ కాలనీ**



జేఈఈ (మెయిన్స్) ప్రవేశ పరీక్ష మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 95 మందికి ఇద్దరు, మధ్యాహ్నం 95 మందికి ముగ్గురు గైర్హాజరైనారు. విద్యార్థులను పూర్తిగా తనిఖీ నిర్వహించిన అనంతరమే పరీక్ష హాల్లోకి అనుమతించారు. ఉదయం సెషన్లో ఒక విద్యార్థి నిర్ణీత సమయం తరువాత రావడంతో పరీక్ష రాయడానికి అనుమతించ లేదని ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామగిరి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# సౌకర్యాలు, ఏర్పాట్ల బాధ్యత ను సింగరేణి, ఎన్టీపీసీ సంస్థలు తీసుకోవాలి

**-పది రోజుల ముందే జాతరకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి కావాలి - రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్**



**సూర్య-గోదావరిఖని:**
పట్టణ శివారులో ఫిబ్రవరి నెలలో జరగనున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన సౌకర్యాలు, ఏర్పాట్ల కు సంబంధించిన పూర్తి బాధ్యతలు సింగరేణి, ఎన్టీపిసి సంస్థలు తీసుకోవాలని రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సూచించారు. ఈ మేరకు శనివారం ఇక్కడ వనదే వతల జాతర నిర్వహణకు సంబంధించి వివిధ విభాగాల అధికారులు, ప్రజా ప్రతినిధులు, జాతర కమిటీ సభ్యులు, విహెచ్ పి, భజరంగ్ దళ్ తదితర సంస్థల ప్రతినిధులతో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ స్థానిక ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవలసిన సామాజిక భాధ్యత సింగరేణి, ఎన్టీపిసి సంస్థలపై ఉందని గుర్తు చేశారు. దీంతో ఇతర విభాగాలపై ఆర్థిక భారం పడకుండా జాతర ఏర్పాట్ల ఖర్చులను వారే భరించి పనులను చేపట్టవలసి ఉందని అన్నారు. అదేవిధంగా అంతర్గాం మండలంలోని గోలివాడ జాతర నిర్వహణలో ఎన్టీపిసి, గోదావరిఖని పట్టణ శివారులో జరిగే జాతర నిర్వహణలో లో సింగరేణి సంస్థ పూర్తి బాధ్యతలు తీసుకోవాలని సూచిం చారు. రామగుండం నగర పాలక సంస్థతో పాటు ఇతర అన్ని ప్రభుత్వ విభాగాలు, ప్రైవేటు సంస్థలు తమ వంతు సహకారం అందిస్తాయని అన్నారు. జాతర సందర్భంగా బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగకుండా ఇక్కడి గోదావరి పుష్కర ఘాట్ వద్ద 1992 నుండి సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహణను సింగరేణి సంస్థ ప్రారంభి ంచిందని అదే ఆనవాయితీని కొనసా గిస్తూ రెండేళ్లకోమారు ఇక్కడ జాతరను నిర్వహి ంచు కోవడం జరుగుతుందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు గతంలో అనేక అసౌకర్యాలు కలిగాయని, ఈ దఫా అలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జాతరకు సంబందించి తాత్కాలిక ఏర్పాట్లు కాకుండా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని, వాహనాల అస్త వ్యస్త పార్కింగ్ తో ఇబ్బందులు ఏర్పడకుండా మైదానంలోకి విఐపి లతో సహా ఎవరి వాహనాల ప్రవేశం లేకుండా చూడాలని అన్నారు. జాతర నలుమూలలా అన్ని ప్రవేశ ద్వారాల వద్ద తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం పోలీస్ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. భక్తులకు మరుగు దొడ్లు, మహిళలకు స్నానపు గదులు, జాతర గ్రౌండ్ లో తగిన లైటింగ్, మంచినీళ్లు, పారిశుద్ధ్యం తదితర వసతులు కల్పించాలని ఆదేశించారు. పోలీస్ కంట్రోల్ రూమ్, వైద్య శిబిరం, మీడియా సెంటర్, అత్యవసర సేవలందించడానికి అన్ని విభాగాల సిబ్బందితో వార్ రూమ్ ఏర్పాటు చేయాలని అన్నారు. జాతర ప్రారంభానికి పది రోజుల ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలని ఆదేశించారు. జాతర అనంతరం గోదావరి నదికి కరకట్ట, సుందమైన పార్కు నిర్మించి ఆ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్, తహసిల్దార్ కుమార స్వామి, సింగరేణి ఆర్జీ-1 ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ తో పాటు పలువురు కార్పొరేటర్లు ఎన్టీపిసి హెచ్ఆర్ అధికారి యుగంధర్ రావు, దేవాదాయ శాఖ ఇడి సుజాత రెడ్డి, ఆర్ఎఫ్ సిఎల్ హెచ్ఆర్ మేనేజర్ కొండా వంశీ కృష్ణ, ఫైర్ ఆఫీసర్ సత్యనారాయణ, జాతర ఈఓ కాంతా రెడ్డి, ఆర్టీసి డిపో మేనేజర్ నాగభూషణం, ట్రాన్స్ కో ఎడిఇ అడిచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దేవంపల్లి సొసైటీ చైర్మన్ పై వీగిపోయిన అవిశ్వాసం తీర్మానం

**సూర్య - మానకొండూర్**



దేవంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు కసిరెడ్డి లత-ప్రభాకర్ రెడ్డి పై డిసెంబర్ 30 వ తారీఖున 9 మంది డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం పై శనివారం జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు సమక్షంలో సమావేశం ఏర్పాటు చేశారు. కాగా సమావేశానికి 13 మంది డైరెక్టర్లకు గాను ఎవరు కూడా సమావేశానికి హాజరు కాకపోవడంతో సహకార సంఘం అధ్యక్షులపై పెట్టిన అవిశ్వాస తీర్మానం చల్లనట్లు జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు తెలిపారు. యధావిధిగా సంఘం అధ్యక్షులు లత వారి విధులు నిర్వహిస్తారన్నారు. మరో సంవత్సరం కాలం పాటు అధ్యక్షురాలిపై ఎలాంటి అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అవకాశం లేదన్నారు. ఆయన వెంట సూపర్డెంట్ శైలజ, అసిస్టెంట్ రిజిస్టర్ కిరణ్ కుమార్, దేవంపల్లి సొసైటీ సీఈవో కసిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి, స్టాప్ అసిస్టెంట్ కాల్వ తిరుపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

**సూర్య-గోదావరిఖని:**



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ గంగానగర్ లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఓపెన్ డ్రైనేజ్, స్లాబ్ కల్వర్టు నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో కార్పొరేషన్ పరిధిలో చాలా డివిజన్ లు అభివృద్ధికి ఆమడ దూరంగా ఉన్నాయని అన్నారు. ప్రణాళిక విధంగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్ లలో అభివృద్ధి పనులు చేపడుతూ నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పుకొచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అందజేస్తామని అన్నారు. ప్రజల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజా పాలన తీసుకువస్తామని తెలిపారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు వచ్చిన నేరుగా ప్రజలు తన దృష్టికి తీసుకువస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, 7వ డివిజన్ కార్పొరేటర్ వేగోళపు రమాదేవిశ్రీనివాస్ గౌడ్ (గంగ శ్రీను) తదితరులతో పాటు పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు. ముందుగా తాజోద్దిన్ బాబా జన్మదినం సందర్భంగా సప్తగిరి కాలనీ లోని దర్గాలో చాదర్ కప్పి, జెండా ను ఎత్తి దర్గాలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రతేక పార్థనలు చేశారు.

# ఒంటరి మహిళలే లక్ష్యంగా దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందుతుల అరెస్ట్

**- సీసీ ఫుటేజీ ఆధారంగా నిందుతుల అరెస్ట్ - వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**సూర్య రాజన్న సిరిసిల్ల.**



ఒంటరిగా తిరుగుతున్న మహిళలే లక్ష్యంగా దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సిరిసిల్ల రూరల్ పోలీస్ లు అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించినట్లు జిల్లా పోలీస్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలానికి చెందిన సిద్ధన యాదవ్వ(33) తోపాటు సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలానికి చెందిన బోదాసు నరేష్(30) ఇద్దరూ ఒక ముఠాగా ఏర్పడి ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారని ఎస్పీ వెల్లడించారు. ఈనెల 12న తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన రుద్రారపు పోషవ్వ(75) అనే వృద్ధురాలు అనారోగ్యం కారణంగా జిల్లెల్ల క్రాసింగ్ వద్ద గల ఒక ఆర్ఎంపీ వైద్యం వద్ద చికిత్స తీసుకొని తిరిగి గ్రామానికి బయలుదేరిందని, ఆమె ఒంటరిగా వెళుతుంది గమనించి పై ఇద్దర నిందితులు దొంగతనానికి పాల్పడ్డారని ఎస్పీ తెలిపారు.బైక్ పై వచ్చిన నిందితులు మందలించి ఇంటిదగ్గర దిగబెడతామని నమ్మించి బండిపై ఎక్కించుకున్నారని, జిల్లెల్ల గ్రామంలో ఇంటి వద్ద దింపే క్రమంలో బలవంతంగా పోషవ్వ మెడలోని పుస్తెలతాడు తెంపుకొని పారిపోయారని ఎస్పీ వివరించారు. బాధితురాలు పోషవ్వ ఫిర్యాదు మేరకు తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి రూరల్ సిఐ సదన్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్.ఎస్.ఐ జునైద్ , సిబ్బంది తో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి దర్యాప్తు చేశారన్నారు.దర్యాప్తులో భాగంగా సిరిసిల్ల రూరల్ సి.ఐ సదన్ కుమార్ ఆధ్వర్యంలో నేరేళ్ల , జిల్లెల్ల క్రాస్ రోడ్, మల్లాపూర్ దేవాలయం, తెర్లుమద్ది, మొర్రాపూర్ బదనకల్, పోత్గల్ ,ముస్తాబాద్, రేగులకుంట గ్రామాల్లో ఉన్న సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా



నిందితులను గుర్తించామని, ఈనెల 26న బద్దెనపల్లి క్రాస్ రోడ్ వద్ద వెహికల్ చెకింగ్ చేస్తుండగా అనుమానంగా కనపడిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఎస్పీ తెలిపారు. ఇద్దరు నింధితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సిరిసిల్ల రూరల్ సి.ఐ సదన్ కుమార్, ఆర్.ఎస్.ఐ జునైద్,సిబ్బంది నరేందర్, రాజశేఖర్, శ్రీనివాస్, అక్షర్ లను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు.

# ఉత్తమ వైద్యుడుగా డాక్టర్ సాయికుమార్‌కు పురస్కారం

**సూర్య రాజన్న సిరిసిల్ల.**



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల ఫ్యాకల్టీ డాక్టర్ సాయికుమార్ ఉత్తమ వైద్యుడుగా పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ సమక్షంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన డాక్టర్ సాయికుమార్ తడుక ప్రస్తుతం జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో పిల్లల వైద్యులుగా, అలాగే ప్రభుత్వ మెడికల్ కాలేజ్ లో ఆకలి తీగ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు.

# ఖచ్చితమైన తుది ఓటరు జాబితా సిద్ధం చేయాలి

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్**

**సూర్య, చొప్పదండి**

రాబోయే ఎన్నికల కొరకు కచ్చితమైన తుది ఓటరు జాబితాను రూపొందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫూల్ దేశాయ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చొప్పదండి నియోజకవర్గం బిఎల్ఓ లతో తుది ఓటరు జాబితా సిద్ధం చేయడం పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో తప్పులు, పొరపాట్లకు ఆస్కారం లేని తుది ఓటరు జాబితాను సిద్ధం చేయడం కొరకు బిఎల్ఓ లు కృషి చేయాలని ఆదేశించారు. బిఎల్ఓ లు బదిలీ అయిన ఓటర్లను గుర్తించినట్లయితే స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి దానిని ధ్రువీకరించిన తర్వాత జాబితా నుండి వారి వివరాలు తొలగించాలని సూచించారు. ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి ఓటరు బదిలీ అయినట్లయితే వారికి ఫామ్-6 ఇవ్వకూడదని తెలిపారు. ఎస్-ఎస్ఆర్, ఏఎస్ టి లో ఎటువంటి పెండింగ్ లేకుండా చూడాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన వారందరు నూతన ఓటర్లుగా నమోదు కాబడేలా చూడాలని తెలిపారు.పోలింగ్ కేంద్రం పరిధి లో 90 సంవత్సరాల వయస్సు ఓటర్లను సమీక్షించుకోవాలని, జాబితా నుండి అర్హుడైన ఒక్క



ఓటరు వివరాలు కూడా తప్పిపోకుండా జాగ్రత్తగా చూడాలని తెలిపారు. 2 కి.మి. పైబడి దూరంలో పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లయితే వాటి వివరాలు సమర్పించాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, విద్యుత్ మొదలగు అన్ని సౌకర్యాలు ఉండేలా పరిశీలించాలని, ఇంకా ఏవైన అవసరమని గుర్తించినట్లయితే వెంటనే దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో సవరణలు గుర్తించినట్లయితే వెంటనే వాటిని సరి చేయాలని తెలిపారు. హెూంఓటింగ్ కొరకు వికలాంగుల, వయోవృద్ధుల వివరాలు సేకరించుకొని సిద్ధంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గం బిఎల్ఓ లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గూటికి బిఆర్ఎస్ నేత మల్లికార్జున రాజేందర్

## - మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణానికి చెందిన మాజీ కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్ తో పాటు పలువురు బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది.మంత్రి పొన్నం ప్రభాకర్ బిఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది.గతంలో కాంగ్రెస్ పార్టీలో జిల్లా స్థాయి పదవులతో పాటు కార్పొరేటర్ గా అవకాశాలు ఇచ్చిన కాంగ్రెస్ గూటికి చేరడం సంతోషంగా ఉందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన గడిచిన కొద్ది రోజుల్లోనే రెండు గ్యారెంటీలు అమలు చేయడం మరొక రెండు గ్యారెంటీలను అమలు చేయడానికి కార్యచరణ ప్రారంభించడం కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేయడం పట్ల ఆకర్షితులై రాష్ట్ర భవిష్యత్తు కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని భావించి నేడు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరుగుతుందని తమను పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కి, స్వాగతించిన జిల్లా నాయకత్వానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాలతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని మల్లికార్జున రాజేందర్ పేర్కొన్నారు. పొన్నం ప్రభాకర్ తో మాజీ ఎమ్మెల్సీ టి సంతోష్ కుమార్,



జిల్లా ఎన్.ఎస్.యు.ఐ అధ్యక్షులు మునిగంటి అనిల్, 55వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడమల్ల శ్రీనివాస్ ఉండగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో 14వ డివిజన్ బిఆర్ఎస్ నేత జంగ శరత్ చంద్ర, వాసర హాస్పిటల్ చైర్మన్ నాగాసముద్రం వాసరయ్య, నాగసముద్రం పురుషోత్తం, బిఆర్ఎస్ నేతలు యాగండ్ల అనిల్ కుమార్, సిద్ది లక్ష్మణ్, వెంకటేశం తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరినారు

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తా

## - ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**సూర్య కొడిమ్యాల**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రము లోని మండల పరిషత్ కార్యాలయం లో శనివారం రోజు ఎంపిపి మేన్నేని స్వర్ణలత అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తా అని తెలిపారు. ఎన్నికలు ఐదు సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి అని తరువాత అందరం కలిసి అభివృద్ధి పై ద్రుష్టి పెట్టాలని కోరారు. సర్పంచ్ లకు రావాల్సిన పెండిగ్ బిల్లులను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుక వెళ్ళి మంజూరు అయ్యే విధంగా కృషి చేస్తానని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు గ్రామాల సమస్యల గురించి నేరుగా మా దృష్టికి తీసుకరావాలని సూచించారు. పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ సమావేశం లో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను మళ్ళీ రాబోయే సమావేశ%శీ% లోపు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సమావేశం లో కొడిమ్యాల సర్పంచ్ ఏలేటి మమత మాట్లాడుతూ గ్రామం లోని ఇందిరానగర్ లో



రేషన్ షాప్ లేకపోవడం వల్ల అక్కడి ప్రజలు దూర ప్రాంతానికి వెళ్ళి రేషన్ తెచ్చుకునే పరిస్థితి ఉందని దీని వల్ల అక్కడి ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు అని కావున ఇందిరానగర్ కాలనీ లో రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని, బస్టాండ్ నుండి అంగడి బజార్ వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, చిలుక వాగు ను పూర్తి స్థాయిలో సుందరికరించి డ్రైనేజీ నిర్మాణం చేయాలనీ కోరారు.డబ్బుతిమ్మయ్యపల్లి ఎంపిటిసి డబ్బు జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ గొర్రెల కోసం లబ్దిదారులు ప్రభుత్వానికీ డీడీల రూపం లో డబ్బులు చెల్లించారు అని చాలా రోజులు అవుతున్న ఇప్పటి వరకు వారికి గొర్రెలు ఇవ్వలేదు డబ్బులు కూడా ఇవ్వలేదు అని వారికి న్యాయం చేయాలని, రైతులకు పూర్తి స్థాయిలో సరి పడే విధంగా యూరియా ను అందుబాటులో ఉంచాలని కోరారు. కొడిమ్యాల ఎంపిటిసి సామల లక్ష్మణ్ మాట్లాడుతూ మండలానికి 108 అంబులెన్స్ లేకపోవడం తో ప్రమాదాలు జరిగినప్పుడు మండల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు కావున 108 అంబులెన్స్ ను మండలానికి ప్రత్యేకంగ ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. చెప్యాల సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామం లోని డబుల్ బెడ్ రూం వద్ద నీటి కొరత ఉన్నదని ఒక మినీ ట్యా%శీ%క్ ఏర్పాటు చేయాలని, చెప్యాల ఎక్స్ రోడ్డు వద్ద నీటి సమస్య ను తీర్చాలని కోరారు. పలువురు సర్పంచ్ లు ఎంపీటీసీలు మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా గ్రమాలలో నీటి సరఫరా జరగడం లేదు అని వీరు వేసిన పైపు లైన్ల వల్ల గ్రామాలలో ఉన్న సీసీ రోడ్లు చేదిపోయాయని సమావేశం దృష్టికి తీసుకవచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికై మొదటి సారి సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు ఎంపిపి మేన్నేని స్వర్ణలత, జడ్పీటీసీ ప్రశాంతి, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, సన్మానం చేశారు.మండలం లోని అన్నీ గ్రామాల సర్పంచ్ లను సమావేశం లో సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎంపిపి మేన్నేని స్వర్ణలత, జడ్పీటీసీ ప్రశాంతి, ఎంపిడివో పద్మజ, తహసీల్దార్ రవికాంత్, మండల వ్యవసాయ అధికారి పర్లపల్లి జ్యోతి, మండల వైద్య అధికారి, పరమేశ్వరి,సర్పంచ్ లు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్ లు,అదికారులు,తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ నిర్ణయాల వల్లే రైతులకు ఎరువుల కొరత లేదు

## - ధాన్యం నిల్వల కోసం గోదాముల ఏర్పాటు. - జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**సూర్య, రాయికల్**

రాయికల్ మండలం అయోధ్య గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్వర్యంలో నూతనంగా నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం ను జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్ .ప్రారంభిం చారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటుకు ముందు 6 లక్షల మెట్రిక్ టన్నుల గోదాం లు ఉంటే, నేడు 25 లక్షల మెట్రిక్ టన్నుల గోదాం లు నిర్మించుకున్నం అన్నారు.కేసిఆర్ నిర్ణయాల వల్ల నేడు తెలంగాణ రాష్ట్రం లో ఎరువుల కొరత లేదు అని అన్నారు.నాస్కబ్ ఛైర్మెన్ కొండూరు రవీందర్ రావు కృషితో నేడు రాష్ట్రం కో సొసైటీ ల బలోపేతం చేయటం జరిగిందని,దేశం లో 750 సొసైటీలలో ఉమ్మడి కరీంనగర్ కేడీసీసీ అగ్రభ ాగాన నిలిచినది అని ఆయన అన్నారు.రైతుల పిల్లలకు విదేశాల్లో చదువులకు సైతం విద్య రుణాలు అందజేస్తున్నము అని అన్నారు.



కేడీసీసీలో రైతులు వారి సొమ్మును డిపాజిట్ చేయాలని, సహకార రంగంలో తక్కువ వడ్డీ రేటు కే వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేయవచ్చు అని ఆయన అన్నారు.రైతుల లాభం కోసం రైతు బజార్ లు,సమీకృత మార్కెట్ లు ప్రారంభించడం జరిగిందని,4 కోట్ల తో బీట్ బజార్,8 కోట్ల తో చల్ గల్ పండ్ల మార్కెట్ ల నిర్మాణం చేపట్టామ న్నారు. రైతులు సంఘటితంగా ఉండడం ద్వారా లాభాలు సాధ్యం అవుతాయని,గోదాంల సామర్థ్యం విషయం లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాష్ట్రం లో ప్రథమ స్థానం లో ఉంది అని ఆయన అన్నారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం నిర్ణయాల వల్ల 3 లక్షల ఎకరాల్లో పంట సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందని అన్నారు.నేటి రాష్ట్రంలో రైతులకు మరిన్ని సంక్షేమ అభివృద్ధి పథకాలు అందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అశ్విని జాదవ్,పాక్స్ చైర్మన్ లు యాదవ నేని రాజ లింగం యాదవ్,ఏనుగు మల్లారెడ్డి,రాజీ రెడ్డి,ముత్యం రెడ్డి, వైస్ ఎంపీపీ మహేశ్వర రావు,సర్పంచ్లు జీవన్ రెడ్డి, ముత్తయ్య, ఎంపీటీసీ రానవేణి భారతరవీందర్,ఉపసర్పంచ్ ఏనుగు రవీందర్, పాక్స్ వైస్ చైర్మన్ దేవయ్య ,పాక్స్ డైరెక్టర్ లు,సీనియర్ నాయకులు సురేందర్ నాయక్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తలారి రాజేష్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బర్కం మల్లేశం, కుమ్మరపల్లి ఎంపీటీసీ నాగరాజు, గ్రామ శాఖ అధ్యక్షులు దావనపెల్లి నర్సయ్య, ఉపాధ్యక్షులు బండారి సురేష్ గౌడ్. మార్కెట్ కమిటీ డైరెక్టర్ బత్తిని వెంకటేష్ గౌడ్,వార్డ్ సభ్యులు అరికిల్లా లావణ్య, రాజశ్రీనివాస్, నందగిరి లక్ష్మి రవీందర్,నాయకులు చొప్పదండి తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సీనియర్ పాత్రికేయమిత్రుని కూతురి జన్మదిన వేడుకలు

**సూర్య వేములవాడ టౌన్**



జర్నలిస్టు సంక్షేమ సంఘం యూనియన్, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత వొడ్యాల హరిత వేణు దంపతుల కూతురు వన్షిక పటేల్ జన్మదిన వేడుకలు మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చిన్నారి వన్షికచే కేక్ కట్ చేయించి అన్నార్తులకు, పేదలకు యాచకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ట్రస్టు నిర్వాహకులు తెలియజేశారు. చిన్నారి తండ్రి వేణు మాట్లాడుతూ ఇంట్లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకునే కన్న ఇలా ట్రస్టు ఆధ్వర్యంలో అన్నార్తుల మధ్య జన్మదిన వేడుకలు చేసుకోవడం ఆనందంగా ఉంది అని, గత రెండు సంవత్సరాలుగా ట్రస్టు ద్వారానే పిల్లల జన్మదిన వేడుకలు నిర్వహించు కొంటున్నామని ఈ అవకాశం కల్పించిన ట్రస్టు వారికి కృతజ్ఞతలు అన్నారు. ఈ కార్యక్రమంలో వొడ్యాల వేణు కుటుంబ సభ్యులతో పాటు ట్రస్టు సభ్యులు మధు మహేష్, గొంగళ్ళ రవికుమార్, తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక ఆర్.సీ.ఇంచార్జి గజ్జెల శ్రీనివాస్, పొలాస రాజేందర్, చల్లా సత్తయ్య, సగ్గు రాహుల్ వీరగొని ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# ఉత్తమ ఉద్యోగి గా ఐలాపూర్ గ్రామ కార్యదర్శి

**సూర్య కోరుట్ల రూరల్**



గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలోని ఐలాపూర్ గ్రామ కార్యదర్శి పాతర్ల నవీన్ కుమార్ ఉత్తమ ఉద్యోగిగా ప్రశంస పత్రాన్ని జిల్లా కలెక్టర్ షైక్ యాస్మిన్ భాష చేతుల మీదుగా అందుకున్నారు. . కాగా పిఏసి ఎస్ చైర్మన్ చింతకుంట సాయి రెడ్డి నవీన్ కుమార్ ను శనివారం శాలు వాతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజల సహకారంతో ఉత్తమ ఉద్యోగిగా గుర్తింపు లభించిందని ఆయన గుర్తు చేశారు

# ఎన్గల్ రాజన్న ఆలయ నూతన కమిటీ ఎన్నిక

## - అధ్యక్షుడిగా గుంటి గంగాధర్

**సూర్య చందుర్తి**



చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షుడిగా గుంటి గంగాధర్, ఉపాధ్యక్షులుగా కుసుంబ కిష్ట స్వామి మాదాసు స్వామి, ప్రధాన కార్యదర్శిగా లాండే ప్రసాద్, ప్రచారకర్తలుగా మాదాసు స్వామి లకోట స్వదీశ్ క్యాషియర్లుగా లింగంపల్లి తిరుపతిమొకిలే విజేందర్, గౌరవ అధ్యక్షులుగా బోరగాయ కమలాకర్ లింగంపల్లి సత్తయ్య కార్యవర్గ సభ్యులతో పాటు సోషల్ మీడియా సభ్యులను ఎన్నుకున్నారు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గుంటి గంగాధర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేస్తుందన్నారు.. అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులకు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు

# సీతమ్మ దీక్షలో శాలిని రమేష్

## - విశ్వహిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఇంటింటికి అక్షింతల కార్యక్రమం ..

## - రామ్ లల్లా ప్రాణప్రతిష్ట అనంతరం ఒడిబియ్యం తెచ్చిన దుంపేట వాసులు.

**సూర్య జగిత్యాల అర్బన్:**



సీతమ్మ వారి దీక్షలో 21 రోజులు నియమ నిష్టలతో ఉండి ఈ దీక్షలో కేవలం ఫలాలను మాత్రమే భుజించి, సీతమ్మ వారి గుణగణాలను మననం చేసుకుంటూ గడపడమే దీక్ష అని శాలిని రమేష్ అన్నారు. సీతమ్మ వారి దీక్ష అంటే సీతమ్మ వారిలా కష్టాలు పడడం కాదని ప్రస్తుత సమాజంలో తోటి వారితో ఎలా మెదలాలి అత్తమామలతో తల్లిదండ్రులతో సహృదయ భావంతో ప్రవర్తిస్తూ వారి మంచి చెడులు చూసుకొని వారికి సేవలు చేయాలని, భర్త అడుగు జాడలలో నడిచి పుట్టింటి వారికి మెట్టినింటి వారికి మంచి పేరు తేవాలని, ప్రస్తుత సమాజానికి ఆడపిల్లలు ,యువత ఆదర్శంగా నిలిచే సంకల్పమే సీతమ్మ వారి దీక్ష అని షాలిని రమేష్ తెలిపారు. ఈ క్రమంలో షాలినిరమేష్ తన పరిసర ప్రాంతాలలో ఉన్నటువంటి రైతుల అందరి చేత వారి వారి పొలాల్లో పండిన వరి ధాన్యం నుండి చేతితో వరి ఒలిచి అక్షింతలను విశ్వహిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యుల ద్వారా అయోధ్య శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు పంపించడం అదృష్టంగా భావించానని, ఈ కార్యక్రమం అంతా తన చేతుల మీదుగా జరగడం అదృష్టంగా భావిస్తున్నట్లుగా తెలియచేస్తూ ట్రస్టు సభ్యులందరూ కలియుగంలో రాముని ప్రాణ ప్రతిష్ట మహోత్సవములో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, ఈ అక్షింతల కార్యక్రమం మరియు శ్రీరామనవమికి తలంబ్రాల కార్యక్రమం ఖచ్చితంగా ప్రతి సంవత్సరం విశ్వహిందూ ధర్మ పరిరక్షణ సమితి ద్వారా చేస్తామని మరియు ఆ శ్రీరాముల వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఇదే విధంగా ప్రజలందరి పైన ఉండి సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లుగా తెలిపారు.

### మాఘ అమావాస్య జాతరకు వచ్చే
# భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలను కల్పిస్తాం

**- రాజన్న ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్**

**సూర్య వేములవాడ టౌన్**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశలో ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో ఫిబ్రవరి 9న జరిగే మాఘ అమావాస్య జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలను కల్పిస్తామని శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ చెప్పారు. శనివారం ఆలయ ధర్మకర్తల మండలి సమావేశ మందిరంలో జడ్పీ చైర్ పర్సన్ అరుణా రాఘవరెడ్డి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆర్టీసీ అధికారులు తగిన బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ చంద్రయ్య గౌడ్, శ్రీ , మధుసూదన్, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, సర్పంచ్ కోక్కుల భారతనర్సయ్య, ఎంపిడిఓ రామకృష్ణ, %ా×% ఆంజనేయులు, డిప్యూటీ తాసిల్దార్ సత్య నారాయణ,



సూపరిండెంట్, శ్రీరాములు, ఆలయ ఇన్చార్జి నరేందర్, ఉపసర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి,అర్చకులు తీరున హరికృష్ణ,లక్ష్మణ్,జూనియర్ అసిస్టెంట్ దేవయ్య, కమలాకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో త్వరలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులకు మున్సిపల్ సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక తెలిపారు. శనివారం హుజురాబాద్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్ పర్సన్ రాధిక ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 38 అంశములను ప్రస్తావించగా 37 అంశములకు పాలకవర్గం ఆమోదం తెలిపారు. వీటిలో పారిశుద్ధ్య నిర్వహణకు వినియోగించే ట్రాక్టర్లు, ఆటో ట్రాలీల రిపేర్, నూతన టైర్లను కొనుగోలు చేయుటకు, 15వ ఆర్థిక సంఘం నిధులతో మిషన్ భగీరథ పైపులైన్ల కొరకు 30 వార్డులలో తవ్విన సిసి రోడ్డులను రిపేరు చేయించుటకు, మిషన్ భగీరథ నల్లాలకు ఆన్/ఆఫ్ వాల్వులు ఏర్పాటు చేయుటకు, నీటి సరఫరా నిర్వహణ కొరకు ఖర్చు చేయుటకు, హరితహారం కార్యక్రమంలో భాగంగా చెట్ల పొదలను తొలగించి ఎత్తు పల్లాలను చదును చేయు నిమిత్తం ఒక జెసిబి ని ఆరు నెలల పాటు కిరాయి కి తీసుకొనుటకు, వివిధ అభివృద్ధి పనుల నిమిత్తము దిన పత్రికలలో టెండరు ప్రకటనల ప్రచురణల బిల్లు చెల్లించుటకు, హిందూ స్మశాన వాటిక వద్ద గల శ్రీ మహా శివుని విగ్రహానికి రంగులు వేయుటకు



ఉన్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, కౌన్సిలర్లు, కమిషనర్ సమ్మయ్య, కార్యాలయ మేనేజర్ కె. రాం మోహన్ రాయ్, ఇంచార్జి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ జి. సాంబరాజు, ఇంచార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ కిషన్ రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికలకోసం సిద్ధంగా ఉండండి

**- కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు. - బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి**

**సూర్య తిమ్మాపూర్ / కరీంనగర్ ప్రతినిధి**

త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలందరూ సిద్ధంగా ఉండాలని కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి లో శనివారం జరిగిన బీజేపీ మండల శాఖ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో భారతదేశం లో ఘనీయమైన అభివృద్ధిని సాధించామని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కూడా వేల కోట్ల అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించేలా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని అన్నారు.పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు సరైన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు.ప్రతీ గ్రామంలో బూత్ స్థాయిలో కార్యకర్తల పనితీరును పెంచుకోవాలని బూత్ అధ్యక్షులకు సూచించారు.నెహ్రు యువకేంద్ర బోర్డు జిల్లా సలహా సభ్యులుగా నామినేట్ చేయబడ్డ కిన్నెర అనిల్ ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.రెండవసారి జిల్లా అధ్యక్షులుగా ఎంపికైన కృష్ణారెడ్డిని మండల కార్యకర్తలు శాలువాతో సత్కరించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు రంగు భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి,జిల్లా అధికార



ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర,జిల్లా కార్యవర్గ సభ్యులు మావురపు సంపత్, బూట్ల శ్రీనివాస్, చింతం శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ సదిరే సత్తయ్య తో పాటుగా వివిధ మోర్చా జిల్లా, మండల నాయకులు, బూత్ అధ్యక్షులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

### గ్రామం లోని పలు సమస్యలను
# సమావేశంలో ప్రస్తావించిన కొడిమ్యాల సర్పంచ్ ఏలేటి మమత-నరసింహారెడ్డి

**సూర్య కొడిమ్యాల:**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రమ ంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం రోజు ఎంపిపి మేన్నేని స్వర్ణలత అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. ఈ సమావేశం లో కొడిమ్యాల సర్పంచ్ ఏలేటి మమత- నరసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామం లోని ఇందిరానగర్ లో రేషన్ షాప్ లేకపోవడం వల్ల అక్కడి ప్రజలు దూర ప్రాంతానికి వెళ్ళి రేషన్ తెచ్చుకునే పరిస్థితి ఉందని దీని వల్ల అక్కడి ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు అని కావున ఇందిరానగర్ కాలనీ లో రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని, బస్టాండ్ నుండి అంగడి బజార్ వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, చిలుక వాగు ను పూర్తి స్థాయిలో సుందరీకరించి డ్రైనేజీ నిర్మాణం చేయాలనీ సమావేశం లో పాల్గోన్న ఎమ్మెల్యే ను అధికారులను కోరారు.ఈ సమావేశం లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎంపిపి మేన్నేని స్వర్ణలత, జడ్పీటీసీ ప్రశాంతి, ఎంపిడివో పద్మజ, తహసీల్దార్ రవికాంత్,



మండల వ్యవసాయ అధికారి పర్లపల్లి జ్యోతి, మండల వైద్య అధికారి, పరమేశ్వరి ,సర్పంచ్ లు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్ లు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు వసతులు కల్పించడంలో విఫలమైన అధికారులు.

**సూర్య వేములవాడ టౌన్**

తెలంగాణ రాష్ట్రంలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పేరు పొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ ఎంతో పేరుగాంచిన దేవాలయం. ఈ దేవాలయం కు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా, వివిధ రాష్ట్రాల నుంచి సమ్మక్క సారక్క జాతరను పురస్కరించుకొని ముందస్తుగా ఈ దేవుని దర్శించుకుని వెళ్లాలని ఒక ఆనవాయితీగా విరజిల్లుతుంది. అలాంటి వేములవాడ పుణ్యక్షేత్రానికి సమ్మక్క సారలమ్మ సీజన్లో దాదాపు ఆరు వారాల పాటు సాగే ఈ జాతరలో లక్షలాది యాత్రికులు వేములవాడకు వస్తుంటారు, ఎన్నో ఒడిదుడుకులతో కష్టనష్టాలతో ఆ భగవంతుని మొక్కు తీర్చుకోవాలని ప్రతిరోజు యాత్రికులు వస్తుంటారు. ఈ యాత్రికులకు రూముల విషయంలో గాని, నీటి సరఫరా, మరుగుదొడ్లు సమస్యలతో సరైన వసతి లేక ఇబ్బంది పడుతున్నారని సిపిఎం నాయకులు గురజాడ శ్రీదర్ అన్నారు ఎన్నో వేల రూపాయలు ఖర్చు పెట్టుకొని ఈ దేవాలయానికి వస్తే చివరికి భక్తులకు సులబ్ కాంప్లెక్స్ కు వెళ్లాలన్న ఒక్కొక్క యాత్రికుని దగ్గర 10 నుంచి 20 రూపాయలు తీసుకుంటున్నారు. కోడెమొక్కులు చెల్లించుకుని నిలబడే యాత్రికులకు నీళ్ల వసతి లేక, టాయిలెట్లు వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయ అధికారుల దృష్టికి తీసుకొచ్చిన కూడా పెడచెవిన పెడుతున్నారు తప్ప భక్తుల మనోభావాలను గౌరవించకుండా కేవలం ఆదాయమే పరమ ధ్యేయంగా తలుస్తున్నారు అని విమర్శించారు. ఇప్పటికైన ఆలయ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దేవాలయం మీద దృష్టి పెట్టి, అధికారుల మీద బాధ్యత పెంచి ఆదాయమే ధ్యేయం అనేది కాకుండా, భక్తుల మనోభావాలు గౌరవించవలసిన బాధ్యత దిశగా యాత్రికులకు వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు

## జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ లో ప్రతిభ చూపిన సిరిసిల్ల చిన్నారులు

**సూర్య రాజన్న సిరిసిల్ల.**



హైదరాబాద్ లోని లాల్ బహుదూర్ శాస్త్రి స్టేడియంలో జరిగిన ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ పోటీలలో రాజన్న సిరిసిల్ల జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ చిన్నారులు ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి పథకాలు సాధించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వద్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముగ్గురు అమ్మాయిలు పాల్గొని సిల్వర్, బ్రాంజ్ మెడల్ సాధించారు. లైట్ కాంటాక్ట్ 50 కేజీల విభాగంలో గంగన వేణి ప్రవళిక ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించించగా, పాయింట్ ఫైట్ 40 కేజీల విభాగంలో దాసరి రష్మిత తృతీయ స్థానం పొంది బ్రాంజ్ మెడల్ సాధించింది. 32 కిలోల విభాగంలో పాయింట్ ఫైట్ లో పాల్గొని వద్నాల కీర్తన ఐదవ స్థానంలో నిలిచింది. జాతీయస్థాయిలో ప్రతిభ చూపిన చిన్నారులు శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. మెడల్స్ సాధించిన విద్యార్థినిలకు జిల్లా ఎస్పీ మెడల్స్ వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. వీరికి కోచ్ గా వ్యవహరించిన ఎలగందుల శ్రీనివాస్ ను కూడా జిల్లా ఎస్పీ అభినందించి శాలువాతో సన్మానించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులను ఈ సందర్భంగా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వద్నాల శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.

## కారుణ్య నియామక పత్రాలు వెంటనే అందజేయాలి

**సూర్య సెంటినరీ కాలనీ 07 :**



సింగరేణి సంస్థ లో సాధారణ ఎన్నికల కోడ్, యూనియన్ ఎన్నికల నేపథ్యంలో ఆలస్యం కాబడిన కార్పొరేట్ మెడికల్ బోర్డు ద్వారా వచ్చిన కారుణ్య నియామక పత్రాలు మరియు వివిధ ఎక్స్టర్నల్ నియామక పత్రాలు వెంటనే అందజేయాలని ఏఐటియుసి యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వై. వి.రావు మెమోరాండం ను ఆర్జీ-3 పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ కి అందజేశారు. కారుణ్య నియామక పత్రాలు మరియు వివిధ ఎక్స్టర్నల్ రిక్రూట్మెంట్ నియామక పత్రాలు సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలో అభ్యర్థులందరికీ అందజేయాలని ఏఐటీ యూసీ గా సింగరేణి వ్యాప్తంగా ఆయా ఏరియాల జిఎంలకు మెమోరం ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సెక్రటరీ జూపాక రామచంద్రన , బ్రాంచ్ సెక్రటరీ ఎం ఆర్ సి రెడ్డి, మెడికల్ అన్ ఫిట్ అయిన కార్మికులు పాల్గొన్నారు.